సాక్షి
ములుగు
శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



మట్టి గణపతికే జై..
పర్యావరణ హితమైన మట్టి గణపతి విగ్రహాలను పూజించేందుకు ముందుకు రావాల్సిన బాధ్యత అందరిపై ఉంది. - 8లో ▸



కల్లెడ ఆణిముత్యం దీప్తి..
వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన దీప్తి.. పారాలింపిక్స్‌లో పతకం తేవడంతో ఊరంతా సంబురాలు చేసుకుంటున్నారు. - 8లో ▸

గరిష్టం/కనిష్టం
29.4° /25.1°

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న షర్మిల



వెంకటాపురం(కె): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును గురువారం సీహెచ్. షర్మిల అందుకున్నారు. మండల పరిధిలోని ఆలుబాక జెడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షర్మిల గణితశాస్త్రంలో వినూత్న పద్ధతుల్లో బోధన చేస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన విషయం తెలిసిందే. ఈ మేరకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన గురువారం గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షర్మిల మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా కుటుంబ సభ్యులతో కలిసి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును అందుకున్నారు.

ఏజెన్సీలో ఆరెంజ్ అలర్ట్

ఏటూరునాగారం: జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలైన ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాలను వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్‌గా ప్రకటించిందని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9నుంచి మళ్లీ అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ఆయా మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు. పోలీసు బృందాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

‘ఆస్పత్రిలో బెడ్ల కొరత లేదు’

ములుగు: జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో రోగులకు సరిపడా బెడ్లు ఏర్పాటు చేసి వైద్యం కోసం వచ్చే రోగులకు వైద్యసేవలు అందిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. ఆస్పత్రిలో బెడ్ల కొరత ఉందని సోషల్ మీడియాల్లో వస్తున్న తప్పుడు ప్రచారం నమ్మవద్దని తెలిపారు. నిత్యం వందలాది మంది వ్యాధిగ్రస్తులు ఆస్పత్రికి వస్తున్నారని తెలిపారు. కలెక్టర్, మంత్రి సీతక్క ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని అదనంగా బెడ్లు ఏర్పాటు చేశామని వివరించారు. ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

వాహనాల తనిఖీ



ఎస్‌ఎస్‌తాడ్వాయి: కొత్తగూడెం భద్రాద్రి జిల్లాలోని కరకగూడెం మండలం మోతే గ్రామం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ సందర్భంగా గురువారం మండల పరిధిలోని బీరెల్లిలో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. కొత్త వ్యక్తులను విచారించి వదిలేశారు. మండల కేంద్రంలోని కాటాపూర్ క్రాస్ వద్ద జాతీయ రహదారిపై వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేశారు.

కాలిపోయిన ఇన్స్‌లేటర్లు



వాజేడు: బుధవారం రాత్రి ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి వెంకటాపుర(కె) నుంచి వాజేడుకు వచ్చే 33/11 కేవీ విద్యుత్ లైన్‌కు సంబంధించిన ఆరు ఇన్స్‌లేటర్లు కాలిపోయాయి. దీంతో మండలంలో బుధవారం రాత్రి 10నుంచి గురువారం మధ్యాహ్నం 2గంటల వరకు అంధకారం నెలకొంది. ప్రజలు తాగునీరు లేక ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సిబ్బంది రాజేందర్, వంశీ, మిగతా సిబ్బంది ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కష్టపడి ఇన్స్‌లేటర్లను ఏర్పాటు చేశారు. అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

రేపటినుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో ఈనెల 7వ తేదీ నుంచి 16 వరకు గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఈఓ మారుతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 7న ఉదయం 10గంటలకు వినాయక విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమంతో ప్రారంభం అవుతుందని తెలిపారు. భక్తులు, స్థానికులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కార్మికులకు అండగా.. లేబర్‌కార్డు

జిల్లా వ్యాప్తంగా 26,785 కార్డులు
- 18నుంచి 60ఏళ్ల లోపు కార్మికులు అర్హులు
- నిరుపేదలకు చేకూరుతున్న లబ్ధి



ములుగు రూరల్: భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న లేబర్ కార్డులు నిరుపేద కూలీలకు లబ్ధి చేకూరుతోంది. ప్రభుత్వ పథకాలలో కార్మికులు లబ్ధిపొందేందుకు లేబర్ కార్డు తప్పనిసరిగా మారింది. లేబర్ కార్డు కలిగిన వారికి ప్రభుత్వం వివిధ రంగాలలో శిక్షణ అందిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. తాపీ మేస్త్రీ, ఎలక్ట్రిషన్, ప్లంబర్ వర్క్, పేయింటర్లు, వడ్రంగి, వెల్డింగ్ పనులు చేస్తున్న కార్మికులకు సైతం లేబర్‌కార్డు జారీ చేస్తుంది. ఇప్పటి వరకు జిల్లాలోని 9మండలాల్లో 26,785 మంది లేబర్ కార్డులను పొందారు. భవన నిర్మాణ రంగాలో పని చేస్తూ 18ఏళ్ల నిండి 60సంవత్సరాల లోపు వయసు కలిగిన వారు లేబర్ కార్డు నమోదుకు అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. కార్డు పొందిన కార్మికులు ప్రభుత్వం అందించే వివిధ పథకాల ద్వారా అబ్ధిపొందేందుకు వీలుంటుంది.

ప్రయోజనాలు

లేబర్ కార్డు కలిగిన కార్మికుడి కుమార్తె వివాహానికి కానుకగా రూ.30 వేలు, ప్రసవం కింద రూ.30 వేలు అందిస్తారు. లేబర్‌కార్డు కలిగిన కార్మికుడి భార్యకు లేదా కుమార్తెకు, కార్మికుడికి ఇద్దరు కుమార్తెలు ఉంటే ఒక్కొక్కరికి రెండు కాన్పులకు పథకం వర్తిస్తుంది. దీంతో పాటు కార్మికుడు ప్రమాదాలకు గురై మరణిస్తే రూ.6లక్షలు వస్తాయి. అలాగే రూ.30 వేలు దహన సంస్కారాల కోసం అందిస్తారు. సహజ మరణం పొందితే రూ. లక్ష బీమా సౌకర్యం ఉంటుంది. దహన సంస్కారాల కోసం రూ.30వేలు అందిస్తారు. ప్రమాదం కారణంగా కార్మికుడికి శాశ్వత అంగవైకల్యం కలిగితే రూ. 5లక్షలు ఆర్థిక సాయంగా అందిస్తారు. పాక్షిక, శాశ్వత అంగవైకల్యం కలిగితే రూ.4లక్షల వరకు ఆర్థిక సాయంగా అందిస్తారు. ఎంప్లాయీస్ కాంపెన్సేషన్ యాక్టు ప్రకారం అంగవైకల్యం శాతాన్ని బట్టి ఆర్థిక సాయం అందుతుంది. కార్మికులు ప్రమాదం లేదా అనారోగ్యంతో తాత్కాలిక అశక్తత కలిగితే చికిత్స నిమిత్తం 5రోజులు ఆపై ఆస్పత్రిలో చేరిన వారికి రోజుకు రూ.300 చొప్పున నెలకు రూ. 4,500 మించకుండా మూడు నెలల వరకు రూ. 13,500వరకు ఆర్థిక సాయం అందించబడుతుంది.



జిల్లాలో లబ్ధిదారుల వివరాలు (2022-24 వరకు)

స్కీం	లబ్ధిపొందిన వారు	చెల్లించిన నగదు
సహజ మరణం	257	రూ. 3,34,19,766
ప్రమాద మరణం	18	రూ.1,13,40,684
డెలివరీ బెనిఫిట్స్	801	రూ.2,40,60,438
మ్యారేజ్ గిఫ్ట్	416	రూ.1,24,95,808
శాశ్వత వైకల్యం	06	రూ.21,002,28
సహజ వైకల్యం	30	రూ.4,06,140

నమోదు విధానం ఇలా..

కార్మికులు పని చేసే ఫొటో, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంక్ ఖాతా బుక్, పని వివరాలతో కూడిన సంబంధిత ఫారాన్ని మీ సేవ కేంద్రంలో సమర్పించాలి. ఆధార్ నమోదు అనంతరం లబ్ధిదారుడు వేలి ముద్ర వేయాలి. రేషన్ కార్డు, బ్యాంక్ వివరాలు, సెల్ నంబర్, కుటుంబ వివరాలను నమోదు చేసుకోవాలి. ఇందుకు గాను మీసేవ కేంద్రాలలో రూ.110 చెల్లించాల్సి ఉంటుంది. ఆ ఫారాన్ని జిల్లా కార్మికశాఖ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. పరిశీలన అనంతరం అధికారులు కార్డు జారీ చేస్తారు. లేబర్ కార్డును ప్రతీ ఐదేళ్లకు ఒకసారి రెన్యూవల్ చేయించుకోవాలి. లేని పక్షంలో సభ్యత్వం కోల్పోతారు.

కార్మికులు లేబర్ కార్డు తీసుకోవాలి



భవన నిర్మాణ రంగంతో పాటు మిగతా రంగాలలో పని చేస్తున్న కార్మికులు లేబర్ కార్డులను తప్పని సరిగా తీసుకోవాలి. కార్డు పొందిన వారితో పాటు వారి కుటుంబాలకు లబ్ధి చేకూరుతుంది. జిల్లాలో 26,785 మంది కార్డులు పొందారు. ఐదు సంవత్సరాలు గడిచిన వారు మీసేవ కేంద్రాలలో సంబంధిత పత్రాలను తీసుకువెళ్లి రెన్యూవల్ చేయించుకోవాలి. కార్మిక విభాగాలలో నూతనంగా పని చేసే వారు లేబర్ కార్డుకు దరఖాస్తులు చేసుకుని కార్డు పొందాలి.

– వినోద, జిల్లా కార్మికశాఖ సహాయ అధికారి

వైద్యులు అంకితభావంతో పనిచేయాలి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ క్రాంతికుమార్


వైద్య సేవలపై ఆరా తీస్తున్న క్రాంతికుమార్

వెంకటాపురం(కె): ఏజెన్సీలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ క్రాంతికుమార్ అన్నారు. మండలంలో ఆయన గురువారం పర్యటించి ప్రైవేట్ వైద్యశాలలు, మందుల షాపులను తనిఖీ చేశారు. తొలుత మండల పరిధిలోని మంగవాయి గ్రామంలోని వైద్య శిబిరాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామస్తులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలను పరిశీలించి రోగులతో మాట్లాడారు. అందుతున్న వైద్య సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యశాలలోని రికార్డులను పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రైవేట్ వైద్యులు రోగులకు ఇంజక్షన్లు వేయవద్దని తెలిపారు.

మహిళలకు ఉపాధి శిక్షణ


రవికి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ చైర్మన్ ప్రభాకర్

ఏటూరునాగారం: మహిళలు స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ ఆర్‌సెటీ డైరెక్టర్ బాస రవి, ఫ్యాకల్టీ పరికి కిశోర్ అన్నారు. మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా దేవాలయం ఫంక్షన్ హాల్లో మహిళలకు మగ్గం, ఎంబ్రాయిడరీలో శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ కేంద్రాన్ని వారు గురువారం సందర్శించగా ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, కమిటీ సభ్యులు, అర్చకులు భానుప్రకాశ్ శర్మ ఆధ్వర్యంలో స్వాగతం పలికి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం వారు శిక్షణా కేంద్రాన్ని సందర్శించారు. తొలుత ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జ్యోతి ప్రజ్వలన చేసి మగ్గం వర్క్, ఎంబ్రాయిడరీ నేర్చుకుంటున్న మహిళలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు చాలా ఉన్నాయన్నారు. అందులో మహిళలు రాణించి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రభాకర్, ఉపాధ్యక్షుడు పర్వతాల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి సతీశ్, కోశాధికారి చిందుకూరి వెంకట్రావు, సహాయ కార్యదర్శి రమేష్, ఆలయ పర్యవేక్షకులు నర్సింహాచారి, అర్చకులు సూర్యనారాయణ శర్మ, జగదీశ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి


జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న నాయకులు

ములుగు రూరల్: గిరిజన మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో జాతీయ రహదారిపై గురువారం ధర్నా చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధానికి పాల్పడగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో ఆదివాసీ మహిళపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని ఉరితీయాలన్నారు. రాష్ట్రంలో గిరిజన, ఆదివాసీ మహిళలపై తరుచూ లైగింక వేధింపులు జరుగుతున్నాయని ఆరోపించారు. గిరిజన, ఆదివాసీ మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులను రాష్ట్ర ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం, మండల అధ్యక్షుడు కుమార్, కృష్ణాకర్, నాగరాజు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి


కెనరా బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ములుగు రూరల్: పంట రుణాలు పొందిన రైతులందరికీ రుణమాఫీని వర్తింపజేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఎండి.అమ్జద్‌పాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని కెనరా బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని హామీనిచ్చి నిబంధనల పేరుతో రైతులను మోసం చేస్తుందన్నారు. ప్రభుత్వం పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్న రైతులకు మాత్రమే రుణమాఫీ చేస్తుందని తెలిపారు. పహాణీ నకల్ ఆధారంగా రుణాలు పొందిన రైతులకు సైతం రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మాఫీ 40శాతం మంది రైతులకు మాత్రమే జరిగిందని వివరించారు. షరతులు లేకుండా తక్షణమే పహాణీ నకల్‌తో రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేయాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మయ్య, పరంసింగ్, సాంబునాయక్, వెంకటరెడ్డి, రమేష్, మహేందర్, లక్ష్మీనారాయణ, రాజు, నర్సయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టర్ దివాకరకు వినతిపత్రం అందిస్తున్న ఆశ కార్యకర్తలు

ములుగు రూరల్: దేశ వ్యాప్తంగా పని చేస్తున్న ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ టీఎస్.దివాకర, జిల్లా వైద్యాధికారి అప్పయ్యకి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వైద్యసేవలు అందిస్తున్న ఆశ వర్కర్లను కేంద్ర ప్రభుత్వం పర్మినెంట్ చేయాలన్నారు. కనీస వేతనం రూ. 26వేలు అందించాలని కోరారు. ప్రభుత్వ పథకాల అమలు చేయడంలో ఆశ కార్యకర్తల పాత్ర కీలకమన్నారు. ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పని చేస్తున్న ఉద్యోగులు బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారని తెలిపారు. ప్రజలకు క్షేత్ర స్థాయిలో వైద్యసేవలు అందిస్తూ కరోనా లాంటి సమయంలో ఆశ వర్కర్లు ముందు వరుసలో ఉండి సేవలు అందించారని తెలిపారు. ఆశ కార్యకర్తలకు పీఎఫ్, ఈఎస్ఐతో పాటు సామాజిక భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు నీలాదేవి, సంధ్య, మాధవి, వాణి, సౌజన్య, అన్నపూర్ణ, శోభ, సుమలత, వినోద, సుజాత, కావ్య, జ్యోతి, సరోజన, కవిత, ఇందిర, వసంత, సుధా, తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతూ.. పెరుగుతూ..


కాళేశ్వరం వద్ద గురువారం రాత్రి గోదావరి నీటిమట్టం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి తగ్గుతూ..పెరుగుతూ వరద తాకిడి కొనసాగుతుంది. గురువారం కూడా అదేస్థాయిలో వరద ఉధృతి నిలకడగా ఉంది. ఎగువన ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి బరాజ్‌ల గేట్లు ఎత్తడంతో దిగువన గోదావరికి వరద నీరు నిలకడగా ప్రవహిస్తూ కాళేశ్వరం పుష్కరఘాటు వద్ద 11.460మీటర్ల ఎత్తు నీటిమట్టంతో దిగువకు తరలిపోతుంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం(సరస్వతీ) బరాజ్‌కు వరద తాకిడి తగ్గడం లేదు. బరాజ్‌కు పెద్దవాగుతో పాటు చిన్నచిన్న వాగుల వరద పోటెత్తడంతో ఇన్‌ఫ్లో 5.29 లక్షల క్యూసెక్కులు తరలివస్తుంది. దిగువన కాళేశ్వరం మీదుగా ప్రాణహిత నది వరదతో కలిసి మేడిగడ్డ బరాజ్‌కు చేరుతుంది. మేడిగడ్డ(లక్ష్మీ)బరాజ్ వద్ద 8.35 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో బరాజ్‌లోని మొత్తం 85గేట్లు ఎత్తి వరద నీటిని కిందికి తరలిస్తున్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే..

- కలెక్టర్ టీఎస్.దివాకర
- కలెక్టరేట్‌లో ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం
- ఉత్తములకు అవార్డుల ప్రదానం


అవార్డులు అందుకున్న వారితో కలెక్టర్ దివాకర, అధికారులు

ములుగు: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని గురువారం గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు మహిళా ఉపాధ్యాయులతో కలిసి కలెక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులకు అర్థమయ్యే సరళమైన పద్ధతిలో బోధించే ఉత్తమ ఉపాధ్యాయులను ఉత్తములుగా గుర్తించి వారికి అవార్డులు, మెమెంటోలు అందించారు. కుటుంబ సమేతంగా వారు హాజరై అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక విద్యార్థి అభివృద్ధిలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకమైందన్నారు. ఉపాధ్యాయుడు పాఠాలు బోధించడమే కాకుండా వారిలో మార్గదర్శకమైన స్ఫూర్తిని నింపాలని సూచించారు. అవార్డులు, మెమెంటోలు తీపుకున్నప్పుడు మరింత బాధ్యత పెరుగుతుందన్నారు. విద్యార్థులకు మంచి బోధన చేయడంతో పాటు విషయపరిజ్ఞానాన్ని వారిలో నింపాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకునేలా చూడాలన్నారు. విద్యార్థులు ఎంత ఇబ్బందులు పెట్టినా ఓపికతో వారికి అర్థమయ్యే వరకు పాఠాలు బోధిస్తూనే ఉండాలన్నారు. విద్యార్థుల జీవితంలో ఉపాధ్యాయులు రియల్ హీరోలుగా నిలిచిపోతారని వివరించారు. తాను ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల స్ఫూర్తితో ఐఏఎస్ సాధించగలిగానని కలెక్టర్ వివరించారు. అవార్డులు రాని వారు వచ్చిన ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ పాణిని, మండల ఎంఈఓలు, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయురాలు జీవనప్రియ

కోటగుళ్లతో ప్రత్యేక అనుబంధం



గణపురం: వృత్తిరీత్యా విధులు ఎక్కడ నిర్వహించినా తనకు ఎప్పటికి కోటగుళ్లతో ప్రత్యేక అనుబంధం ఉంటుందని నార్కోటిక్ బ్యూరో ఎస్పీ పోతరాజు సాయిచైతన్య అన్నారు. గణపురం మండల కేంద్రంలోని కోటగుళ్లను గురువారం ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు నాగరాజు ఆధ్వర్యంలో ఆలయ పరిరక్షణ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన గణపేశ్వరుడికి రుద్రాభిషేకం చేయడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను పరిరక్షణ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట హైకోర్టు అడ్వకేట్ కశ్యప్ పాల్గొన్నారు.

పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

ములుగు రూరల్: పోడుభూములు సాగు చేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకాలు అందించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ దివాకరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటాపురం గ్రామానికి చెందిన నిరుపేద రైతులు సాగు చేసుకుంటున్న పోడు భూములను రెవెన్యూ, అటవీశాఖ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి పట్టాలు అందించాలన్నారు. సర్వే నంబర్ 368లోని భూమి సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న రైతులపై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నర్సయ్య, జిల్లా కన్వీనర్ అమ్జద్‌పాషా, శ్యాంసుందర్, రామస్వామి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

భూపాలపల్లి రూరల్: ప్రతీ డ్రైవర్ ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పక పాటించాలని డీఎస్పీ సంపత్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో లారీ యాజమానులతో పాటు డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సంపత్‌రావు మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పక పాటించాన్నారు. రహదారులకు ఇరువైపులా లారీల పార్కింగ్ చేస్తున్నారని.. వెంటనే తొలగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులు కావద్దన్నారు. పార్కింగ్ లేని ప్రదేశాల్లో లారీలను నిలపడం మూలంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. అతి వేగంగా వెళ్లి ప్రమాదాలకు కారకులైతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో సీఐ నరేష్ కుమార్, ఎస్సై సుధాకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంతర్జాతీయ కబడ్డీ పోటీల్లో మల్సూర్ ప్రతిభ


పతకం అందుకుంటున్న మల్సూర్

డోర్నకల్: నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ కబడ్డీ పోటీల్లో డోర్నకల్ మండలం చాప్లాతండాకు చెందిన క్రీడాకారుడు ప్రతిభ కనబర్చాడు. తండాకు చెందిన ధారావత్ మల్సూర్ నేపాల్‌లోని పోక్రాలో ఈ నెల 1వ తేదీన ఇంటర్నేషనల్ యూత్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ కబడ్డీ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. ఫైనల్‌లో నేపాల్.. ఇండియా జట్టుపై విజయం సాధించడంతో ఇండియా సిల్వర్ పతకం పొందింది. ఫైనల్‌లో మల్సూర్ జట్టు 15 పాయింట్లు సాధించడంతో బెస్ట్ ఆల్‌రౌండర్ పతకం అందుకున్నాడు. ఈ సందర్భంగా మల్సూర్‌ను స్థానికులు అభినందించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు కేసు వచ్చే నెల 17కు వాయిదా

భూపాలపల్లి అర్బన్: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్టులో అవినీతిపై భూపాలపల్లికి చెందిన వ్యక్తి జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జిల్లా కోర్టుకు గురువారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, కాంట్రాక్టర్ మెగా కృష్ణారెడ్డి, అధికారులు సబర్వాల్, రజత్‌కుమార్, ఎల్‌అండ్‌టీ కంపెనీ ప్రతినిధుల తరఫున న్యాయవాదులు నరసింహారెడ్డి, ఆదానీ హాజరయ్యారు. జడ్జి నారాయణబాబు కేసును వచ్చే అక్టోబర్ 17వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిసింది.

తన వాటా ఇప్పించాలని తహసీల్ ఎదుట నిరసన

- మందు డబ్బాతో బాధితుల ఆందోళన


తహసీల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బాధితురాలు యశోద

జనగామ రూరల్: తన భర్త తేజావత్ శ్రీనివాస్ వాటా తమకు ఇప్పించాలని జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్ జీపీ పరిధి పెద్దతండా (వై)కి చెందిన యశోద తన ముగ్గురు పిల్లలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసనకు దిగింది. పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యాయత్నానికి యత్నించగా తహసీల్ సిబ్బంది మందుడబ్బా లాక్కుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితురాలు యశోద కథనం ప్రకారం.. తండాలోని 85/ఎ/1 సర్వే నంబర్‌లో 14 ఎకరాల భూమి ఉండగా.. వారసత్వ వాటాగా 3 ఎకరాలు రావాల్సి ఉండగా.. తన భర్త అన్నదమ్ములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. తనకు ఇద్దరు ఆడపిల్ల లు ఉన్నారని, భూమి ఇప్పించకుంటే కుటుంబంతో సహా ఎమ్మార్వో కార్యాలయం వద్ద పురుగుల మందు తాగి చావడం తప్ప వేరే దారి లేదని పేర్కొంది. కాగా, విషయంపై తహసీల్దార్ వెంకన్నను వివరణ కోరగా బాధితురాలి పేరుతో భూమి లేదు.. గతంలో ఈ విషయంపై వివరించాం.. చట్టం ప్రకారం ఎవరి పేరుతో భూమి ఉంటే వారు చెప్పిన వారికి స్లాట్ బుక్ చేసుకుంటే పట్టా చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

మట్టి వినాయకుడే శ్రేయస్కరం



వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే విగ్రహాల విషయంలో పూర్తిగా భక్తి శ్రద్ధలు ఉండాలి. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే మట్టితో చేసిన ప్రతిమలనే ప్రతిష్ఠించి నవరాత్రులు పూజించడం శ్రేయస్కరం. మండపాలపై అందరూ మట్టి వినాయకులను ఏర్పాటు చేసుకోవాలి.

-గంగు ఉపేంద్రశర్మ, వేయిస్తంభాల దేవాలయ ప్రధానార్చకుడు, హనుమకొండ

పర్యావరణాన్ని కాపాడుదాం



ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో పాటు వినాయక ప్రతిమల కోసం వినియోగించే కెమికల్ రంగులతో పర్యావరణానికి ముప్పు కలుగుతుంది. ప్రకృతికి తీవ్ర హాని కలుగుతుంది. ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలి. మట్టి వినాయకులను ప్రతిష్ఠించుకుందాం. పర్యావరణాన్ని కాపాడుకుందాం.

- న్యాలకొండ భాస్కర్‌రావు, కన్వీనర్, వరంగల్ మహానగర్ గణపతి నవరాత్రి ఉత్సవ సమితి

ఇదే నా జీవనాధారం



వినాయక విగ్రహాల తయారీ పనిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. వినాయక చవితి సమయాల్లో మాత్రమే తెలంగాణ వైపు వస్తాం. ఆ తర్వాత కోల్‌కతా వెళ్లిపోతాం. దసరా ఉత్సవాలకు సంబంధించి అక్కడ దుర్గాదేవీ విగ్రహాలు తయారు చేస్తాం.

- చందన్, కోల్‌కతా, విగ్రహాల తయారీదారుడు

మట్టి విగ్రహాలే శ్రేష్ఠం



20 ఏళ్లుగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నా. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో చేసే విగ్రహాలు పర్యావరణానికి హాని కలిగిస్తుంది. ప్రతి ఒక్కరూ మట్టితో చేసే విగ్రహాలను పూజించాలి. వినాయక చవితి సమయంలో ఇలా ఉపాధి దొరుకుతుంది. మిగతా రోజుల్లో కోల్‌కతాకు వెళ్లి పనులు చేసుకుంటాం.

-భీష్మ, కోల్‌కతా, విగ్రహాల తయారీదారుడు

మట్టి గణపతికే జై..

మట్టి వినాయకులనే పూజిద్దాం
- పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం
- మొదలైన నవరాత్రోత్సవాల సందడి
- విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు


విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి వినాయక విగ్రహాలు


కాజీపేటలో మట్టితో వినాయక విగ్రహం తయారు చేస్తున్న కళాకారుడు

హన్మకొండ కల్చరల్: ఊరూ.. వాడ సందడిగా నిర్వహించే వినాయక చవితి సమీపిస్తోంది. ఉత్సవాలు ఈనెల 7న ప్రారంభం కానున్నాయి. ఇక ఒక రోజు మాత్రమే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే మండపాలను సిద్ధం చేసేపనిలో నిమగ్నమయ్యారు. అయితే పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ (పీఓపీ) విగ్రహాలను దూరంగా ఉంచి ఆదర్శంగా నిలవాల్సిన తరుణమిదే. పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలను పూజించేందుకు ముందుకు రావాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఈ దిశగా గ్రామాల నుంచి నగరం వరకు అందరూ ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

పనులకు ఆటంకం కలగొద్దని పూజలు..

చేపట్టిన పనులు ఎలాంటి ఆటంకాలు, అడ్డంకులు రాకుండా నిర్విఘ్నంగా జరగాలని గణనాథుడిని పూజిస్తారు. గణనాయకుడు జన్మించింది పార్వతీదేవి మేనినలుగు మట్టి నుంచేనని శాస్త్రాలు చెబుతున్నాయి. అందుకే మట్టి వినాయకుడిని పూజిస్తే చేపట్టే కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగి ముక్తి కలుగుతుందని విశ్వసిస్తారు. ప్రకృతి ప్రేమికులు సైతం వినాయకుడిని పూజిస్తే ప్రకృతిని ప్రేమించినట్లేనని చెబుతారు.

రంగులతో అనర్థం..

విగ్రహాల తయారీకి వినియోగించే రంగులు అనారోగ్యానికి అత్యంత హానికరం. వినాయక ప్రతిమలను నిమజ్జనం చేసే సందర్భంగా నీటిలో ఈ రంగులు కలిసిపోవడం వల్ల నీరు కలుషితమవుతుంది. అంతేకాకుండా ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలు ఏర్పాటు చేయడంతో వెలువడే విషవాయువుల వల్ల వాతావరణం కలుషితమై మానవాళికి ముప్పు ఏర్పడుతుంది.

మట్టి వినాయకుడితో ఉపయోగాలు ..

మట్టి వినాయకుడిని పూజించడం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి. ప్రకృతిని పూజించే అవకాశం కలుగుతుంది. నిమజ్జనం సందర్భంగా మట్టి నీటిలో సులభంగా కరుగుతుంది. నీటిలోని జీవరాసులకు ఎలాంటి హాని కలగదు. అదేవిధంగా నీరు కూడా కలుషితం కాదు.

మూడేళ్లుగా మట్టి వినాయకుడినే ప్రతిష్ఠిస్తున్నాం..



ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో కలిగే అనర్థం ప్రజలకు ఇప్పటికే అర్థమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేస్తుండడం బాగానే ఉన్నా.. ఎంత మంది మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజిస్తున్నారనే విషయం ముఖ్యం. మూడేళ్లుగా మా కాలనీలో మట్టి గణనాథుడినే ప్రతిష్ఠిస్తున్నాం.

-అరూరి సాంబయ్య, విష్ణుపురి కాలనీ, కాజీపేట

మట్టి వినాయకులను పూజిద్దాం

- వరంగల్ ఎంపీ కావ్య


వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీ కావ్య, తదితరులు

హన్మకొండ చౌరస్తా: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజిద్దామని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యాన రూపొందించిన మట్టి గణపతి విగ్రహాల పంపిణీ, వాల్ పోస్టర్లను హనుమకొండలోని నివాసంలో గురువారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ రసాయన రంగులు అద్దిన విగ్రహాల ద్వారా నీరు కలుషితం అవుతుందని, తద్వారా అందులోని జలచరాలు మృత్యువాత పడతాయని చెప్పారు. పండుగలను ప్రకృతి హితంగా జరుపుకుంటూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములం అవుదామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొల్ల శరత్‌చంద్రారెడ్డి, జాతీయ కార్యదర్శి సీహెచ్.సాగర్, జనగామ జిల్లా అధ్యక్షుడు నీలం యువరాజు, అరవింద్, రవి, ఉదయ్ పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- 12 తులాల బంగారు, 80 తులాల వెండి ఆభరణాలు, రూ.2 లక్షల నగదు అపహరణ
- మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఘటన

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో 12 తులాల బంగారు, 80 తులాల వెండి ఆభరణాలు, రూ.2 లక్షల నగదు అపహరణకుగురికాగా ఈ విషయం గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు కాసోజు బ్రహ్మచారి కథనం ప్రకారం.. పౌరోహిత్యం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్న కాసోజు బ్రహ్మచారి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కంకర మిల్ తండ సమీపంలో నివసిస్తున్నాడు. ఆయన భార్య అశ్విని గర్భిణి కాగా ఆమె ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో గత నెల 31వ తేదీన హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి వెళ్లారు. ఈ క్రమంలో ఈ నెల 2వ తేదీన వారి బంధువు.. బ్రహ్మచారి ఇంటి ముందు నుంచి వెళ్తూ ఇంటి తలుపులు తెరచి ఉండడాన్ని గమనించి బ్రహ్మచారికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో వారు హుటాహుటిన ఇంటికి వచ్చి చూసి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫింగర్ ప్రింట్స్ బృందం ఘటన స్థలంలో ఆధారాలు సేకరించింది. అనంతరం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


ఆధారాలు సేకరిస్తున్న ఫింగర్ ప్రింట్స్ బృంద సభ్యుడు

ప్రకృతి సేద్యంతోనే మానవ మనుగడ

- త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డి

కేసముద్రం: ప్రకృతి వ్యవసాయంతోనే భవిష్యత్‌లో మానవ మనుగడ సాధ్యమని త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డి అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామంలో అభినవ్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా అభినవ్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం అవసరమని, ఆర్గానిక్ పంటల సాగు ద్వారా రైతులకు అధిక లాభాలు వస్తాయన్నారు. సేంద్రియ ఎరువులతో పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంతో దృఢంగా ఉంటారన్నారు. ప్రధానమంత్రి మోదీ సులభతరమైన పద్ధతిలో వ్యవసాయం చేసేందుకు డ్రోన్ పథకం ద్వారా డ్రోన్, ఇతర పరికరాలను సబ్సిడీపై ఇస్తున్నట్లు పేర్కొన్నారు. త్రిపురతోపాటు ఇతర రాష్ట్రాల్లో ఆర్గానిక్ పంటలకు అధిక ప్రాధాన్యం ఇస్తారని, ప్రధాని చేపట్టే ప్రతీ కార్యక్రమంలో ఆర్గానిక్‌తో కూడిన వంటకాలనే భోజనంగా అందిస్తారని తెలిపారు. అనంతరం డ్రోన్‌లను పరిశీలించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ.. ప్రతీరైతు ప్రకృతి వ్యవసాయం చేయాలని, సేంద్రియ పద్ధతిలో పండించిన పంటలకు తప్పకుండా మార్కెట్లో ధర లభించేలా తాను చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రముఖ ప్రకృతి సాగు శిక్షకుడు విజయరాం మాట్లాడుతూ.. రసాయన ఎరువుల వినియోగంతో పండించే పంటలను తినడం వల్ల ఎసిడిటీ వస్తుందని చెప్పారు. తాము 15 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నామని, ఆ పంటనే తిరుపతిలో శ్రీవేంకటేశ్వరస్వామి వద్ద నైవేద్యం సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు భూతాపాన్ని తగ్గించేలా వ్యవసాయ పద్ధతులు పాటించాలని సూచించారు. ముందు త్రిపుర గవర్నర్‌కు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ స్వాగతం పలికారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం చేశారు. సొల్లేటి జైపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ డేవిడ్, డీఏఓ విజయనిర్మల, ఆర్డీఓ అలివేలు, డీఎస్పీ తిరుపతిరావు, తహసీల్దార్ దామోదర్, ఏఓ వెంకన్న, శాస్త్రవేత్త క్రాంతికుమార్, సంకు శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

ముగిసిన ఏసోబు అంత్యక్రియలు

- నివాళులర్పించిన మాజీ మావోయిస్టులు, రాజకీయ నాయకులు
- కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు, స్థానికులు
- ఎరుపెక్కిన టేకులగూడెం గ్రామం

మడికొండ: ఛత్తీస్‌గఢ్ బార్డర్‌లో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టు కేంద్ర మిలిటరీ ఇన్‌చార్జ్ మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ అలియాస్ దాదా రణదేవ్ అంత్యక్రియలు గురువారం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెంలో అశ్రునయనాల మధ్య జరిగాయి. కుటుంబ సభ్యులు ఏసోబు మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఉదయం 9 గంటల సమయంలో గ్రామానికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. ఎర్ర జెండాలు రెపరెపలు, విప్లవ గేయాల మధ్య అంతిమ యాత్ర సాగింది. తరలివచ్చిన మాజీ మావోయిస్టులు, రాజకీయ నాయకులు నివాళులర్పించారు. స్థానిక ఎస్సీ కాలనీ సమీప శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. మాచర్ల ఏసోబుకు విప్లవ జోహార్లు అంటూ.. నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మావోయిస్టులు భారతక్క, గాదె ఇన్నయ్య, గాజర్ల అశోక్, న్యూడెమాక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు, ఎలకంటి రాజేందర్, గంగుల దయాకర్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, అరూరి రమేశ్, దాస్యం వినయ్‌భాస్కర్, రాష్ట్ర సీడ్ ఆయిల్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కార్పొరేటర్లు, బంధుమిత్రుల సంఘం సభ్యులు, స్థానిక నాయకులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.


టేకులగూడెంలో ఏసోబు అంతిమయాత్ర


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కల్లెడ ఆణిముత్యం దీప్తి..

- పారాలింపిక్స్‌లో పతకం తేవడంతో అంతర్జాతీయంగా పేరు
- ఊరే గెలిచినట్టుగా సంబరాలు.. తల్లిదండ్రుల్లో ఆనందం
- వైకల్యం ఉన్నా పట్టుదలలో కనిపించని లోపం


ఊరిలో ఏర్పాటు చేసిన బ్యానర్

సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామం.. ఇప్పుడు ఈ పేరు అంతర్జాతీయ యవనికపై మార్మోగుతోంది. ఎందుకంటే పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో ఈ గ్రామానికి చెందిన జీవాంజి దీప్తి కాంస్య పతకం సాధించడమే. ట్విట్టర్లు, ఇన్‌స్టాగామ్ వేదికగా ఆమె విజయాన్ని అందరూ స్మరిస్తుంటే.. గ్రామస్తులు మాత్రం ఆమె పతకం అందుకునేందుకు పడిన శ్రమను గుర్తు చేసుకుంటూ కీర్తిస్తున్నారు. దీప్తితో చదివిన స్నేహితులు, గ్రామ ప్రజలతోపాటు తల్లిదండ్రులు సంబరపడుతున్నారు. దివ్యాంగురాలైన దీప్తి జీవితం ఎలా ఉంటుందని అనుకున్న గ్రామస్తులు.. పారిస్‌లో కాంస్య పతకం సాధించడాన్ని చూసి కూతురంటే ఇలా ఉండాలి అని అంటున్నారు. ఆమె గెలిస్తే ఊరే గెలిచినట్టుగా సంబరాలు చేసుకుంటున్నారు.

ఊరే గెలిచినట్టుంది..



మా కూతురిని చూసి చాలా మంది ఎలా ఉంటుందోనని అంటుండేవారు. ఆ సమయంలో నాకు కూడా చాలా ఇబ్బందిగా అనిపించేది. రన్నింగ్‌లో చిరుతలా పరుగులు తీస్తూ పతకాలు తెస్తుంటే మా ఆనందానికి అవధులు లేవు. పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో మహిళల 400 మీటర్ల టీ20 కేటగిరీ ఫైనల్లో మూడో స్థానంలో కాంస్య పతకం తీసుకురావడంతో నా జన్మకు ఇక ఇది చాలు అనిపించింది. మా గ్రామమే గెలిచినట్టుగా సంబరాలు చేసుకోవడం చూస్తుంటే మాటలు రావడం లేదు. వైకల్యాన్ని అధిగమించి దేశమే గర్వపడే విధంగా నిలిచిన దీప్తికి ప్రభుత్వం ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వాలి. ఆమెను ప్రోత్సహిస్తే ప్రపంచ స్థాయిలో మరిన్ని పతకాలు భారత్‌కు రావడం ఖాయం.

-యాదగిరి, దీప్తి తండ్రి

పారిస్‌లో పరుగులు..



చిన్నప్పటి నుంచి పరుగు పందెం అంటే దీప్తి ఆసక్తి చూపేది. స్నేహితురాళ్లతో కలిసి గ్రామంలో పరుగులు తీసేది. వైకల్యం ఉన్నా తనలో కనిపించకుండా జాగ్రత్త పడుతూ మనో ధైర్యంతో ముందుకెళ్లింది. పాఠశాలలో నిర్వహించే ఆటల్లో ఎప్పుడూ మొదటి స్థానంలో నిలిచేది. అలా ఆమెలో ఉన్న ఆసక్తిని గమనించి ప్రోత్సహించాం. ఆ సమయంలో ఉపాధ్యాయులు కూడా ప్రోత్సహించడంతోనే ఇప్పుడూ పతకాలు తీసుకురాగలుగుతోంది. పేదరికం ఉన్నా ఎక్కడ పోటీలకు వెళ్లినా తిరస్కరించలేదు. కల్లెడ నుంచి పారిస్ వరకు నా కూతురు పయనం ఉండడం, చిన్నప్పుడు కల్లెడలో చేసిన పరుగులే...ఇప్పుడూ పారిస్‌లో నాకు కనిపించాయి. కాంస్యం సాధిస్తే దేశమే గెలిచినట్టు ఉంది. ముఖ్యంగా మా ఊరే గెలిచినట్టు సంబరాలు చేసుకోవడం జీవితంలో మరిచిపోలేని అనుభూతి. -ధనలక్ష్మి, దీప్తి తల్లి

కల్లెడకు పేరు తెచ్చింది..



దీప్తిని నా చిన్నప్పటి నుంచి చూస్తున్నా. కల్లెడలోని ఆర్డీఎఫ్ పాఠశాలలో కలిసి ఒకటి నుంచి ఆరో తరగతి వరకు కలిసి చదివాం. ఆ సమయంలోనే వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు జనవరి 26, ఆగస్టు 15 సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించేవారు. ముఖ్యంగా పరుగు పందెంలో దీప్తి మొదటి వరుసలో ఉండేది. బహుమతులు గెలుచుకునేది. పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లోనూ పతకం సాధించేందుకు తీసిన పరుగులు చూస్తుంటే చిన్నతనంలో ఉన్న ఆ కసినే కనిపించింది. నా స్నేహితురాలు దేశం గర్వించే విధంగా రాణించడం ఆనందంగా ఉంది. కల్లెడకు మంచి పేరు తీసుకొచ్చింది. -మల్యాల రమ్య, స్నేహితురాలు

గ్రామస్తులకే గర్వకారణం..



దీప్తి ఏది అనుకుంటే అది సాధించడంలో దిట్ట. ఆమెకు వైకల్యం కూడా అడ్డు రాలేదు. పారిస్ పారాలింపిక్స్‌లో పతకం సాధించడం ఆమెకే కాదు ఊరికే గర్వకారణం. చిన్నప్పటి నుంచి కొందరు ఆమెను అవహేళన చేసినా, ఇప్పుడు ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు ప్రముఖులతో శెభాష్ అనిపించుకోవడం కల్లెడ గ్రామ పేరు ప్రతిష్ఠను ఇనుమడింపజేసేలా చేసింది.

- ముదురుకుల్లా రమేశ్, కల్లెడ

డెంగీతో యువకుడి మృతి


విజయ్(ఫైల్)

కొత్తగూడ: డెంగీ జ్వరంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గాంధీనగర్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మల్లెల విజయ్(35)కి వారం క్రితం జ్వరం రావడంతో చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు తెల్ల రక్తకణాలు తగ్గిపోయినట్లు గుర్తించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. కాగా, ములుగు మాజీ జెడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి.. మల్లెల విజయ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


చెరువులో పడి పశువుల కాపరి..


రాజు (ఫైల్)

కాటారం: గేదెలను చెరువు నుంచి బయటకు వెళ్లకొట్టడానికి వెళ్లిన ఓ పశువుల కాపరి కందకంలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ప్రతాపగిరి జీపీ పరిధి మద్రిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన నలుబోతుల రాజు(25) పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో రాజు ఉదయం గేదెలను మేపడానికి బొప్పారం శివారులోని దేవుని చెరువు వైపునకు వెళ్లాడు. గేదెలు చెరువులోకి వెళ్లడంతో వాటిని బయటకు వెళ్లగొట్టడానికి అందులోకి దిగాడు. చెరువులో పెద్ద కందకాలు ఉండడంతో రాజు లోతు తెలియక అందులో మునిగిపోయి గల్లంతయ్యాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించి నీటిలో వెతకగా రాజు మృతదేహం లభించింది. కాగా, రాజు భార్య గతేడాది ఆత్మహత్యకు పాల్పడగా తల్లి మల్లక్కతో ఉంటున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు.

విధుల్లో అలసత్వం ఉండొద్దు

- ఆర్‌జేడీఎం, పర్సన్ ఇన్‌చార్జ్ ఉప్పుల శ్రీనివాస్


వరంగల్ మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయం

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ఆర్‌జేడీఎం, మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్ ఉప్పుల శ్రీనివాస్ అన్నారు. ఇటీవల మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి వచ్చిన సందర్భంలో చాంబర్ ప్రతినిధులు, కూరగాయల మార్కెట్ వ్యాపారులు పలు అంశాలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. డైరెక్టర్ సూచనల మేరకు పర్సన్ ఇన్‌చార్జ్‌గా జేడీఎం గురువారం వరంగల్ మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో నిర్వహించిన అంతర్గత సమావేశంలో మార్కెట్ పరిస్థితులు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏనుమాములలోని గ్రేయిన్ మార్కెట్, లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్, పండ్ల మార్కెట్‌లలో అధికారులు, ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది హాజరును సంబంధిత సూపర్‌వైజర్ రోజూ తీసుకోవాలని ఆదేశించారు. ఎవరు ఎక్కడ పనిచేస్తున్నారనే విషయంపై సంబంధిత ఇన్‌చార్జ్‌లు దృష్టి సారించాలన్నారు. మార్కెట్లలో పారిశుధ్య పనులు పొందిన కాంట్రాక్టర్లు మార్కెట్లు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త, మురిగిన కూరగాయలు ఉంటే సంబంధిత కాంట్రాక్టర్ల బిల్లుల్లో కోత తప్పదని హెచ్చరించారు. లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లోని కమీషన్ వ్యాపారులు, కవర్ షెడ్ వ్యాపారులతో మాట్లాడి అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలని ఆదేశించారు. సమావేశంలో డీడీఎం పద్మావతి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల, గ్రేడ్-2 కార్యదర్శులు శ్రీరామోజు రాము, ఎఎస్‌లు అనిల్, రాజేందర్, అకౌంటెంట్ సుకన్య పాల్గొన్నారు.